శివరాముడుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిబంధనలు లేకుండా పత్తిని కొనాలి

• కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేయాలి • ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

పత్తిని తేమ శాతంతో నిమిత్తం లేకుండా పూర్తిగా కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నాను నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ అధ్యక్షత జరిగిన ధర్నానుద్దేశించి జి.రామకృష్ణ మాట్లాడారు. కర్నూలు జిల్లాలో 5.40 లక్షల ఎకరాలలో పత్తి సాగయిందన్నారు. ఈ సంవత్సరం అధిక వర్షాలు, తుఫాను వల్ల దిగుబడి, పంట నాణ్యత తగ్గిందన్నారు. దీన్ని ఆసరా చేసుకుని ప్రైవేట్ వ్యాపారస్తులు కారు చౌకగా కొనుగోలు చేస్తూ రైతులను దగా చేస్తున్నారన్నారు. పోరాట ఫలితంగా ప్రభుత్వం ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెంచికలపాడు దగ్గర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. రకరకాల కారణాలు చెప్పి వెనక్కి పంపడం తక్కువ ధరకు కొనుగోలు చేయడం పరిపాటైపోయిందన్నారు. మరొకపక్క కొనుగోలు కేంద్రం దగ్గరకు పోయి అమ్ముకోవాలంటే కపాస్, కిసాన్ స్లాట్ బుకింగ్ చేసుకోవాలంటే రైతులు నానా యాతన పడుతున్నారన్నారు. తక్షణమే ఈ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు రైతు నుండి కొనుగోలు చేస్తామని ప్రకటనలు చేశారన్నారు. ఆచరణలో మాత్రం అది నెరవేరడం లేదన్నారు. కొనుగోలు కాక రెండు, మూడు రోజులు పడిగాపులు కాసి పక్కలో ఉన్న ప్రైవేటు వ్యాపారస్తులకు రూ.3000కు రూ.4వేలకు అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. రైతు ప్రభుత్వం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. ఈ ఏడాది ఉల్లి పంట 55,700 ఎకరాలు సాగు కాగా, పంట అధిక దిగుబడి వచ్చినప్పటికీ రేటు లేక పంటలను రైతులు పశువులకు, గొర్లకు వదిలారని, కొన్నిచోట్ల దున్నేశారని తెలిపారు. ప్రభుత్వం మొదట వ్యాపారస్తులు కొనుగోలు చేసిన ధరకు వ్యత్యాస ధరను కలిపి రూ.1200 కలిపి ఇస్తానని మొదట ప్రభుత్వం ప్రకటించిందని, కొంత ఉపశమనంగా ఉంటుందని రైతులు భావించారని, కొన్ని రోజులకే ప్రభుత్వం మాట మార్చి హెక్టారుకు రూ.50 వేలు ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేయడం తప్ప మరొకటి కాదని అన్నారు. ఒక ఎకరాకు రైతు ఉల్లి పంటకు రూ.1,20,000 పెట్టుబడి పెట్టగా ప్రభుత్వం కేవలం ఎకరాకు రూ.20వేలు మాత్రమే చెల్లిస్తామనడం ఏమాత్రం సమంజసం కాదని అన్నారు. నష్టపరిహారాన్ని వెంటనే రైతుల ఖాతాలో జమ చేసి ఇన్ పుట్ సబ్సిడీ కూడా ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న పంట 20వేల ఎకరాలు సాగు చేశారని, ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని అన్నారు. వాటిని ఏర్పాటు చేసి మద్దతు ధర రూ.2450 ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోటకొండ సూరి, రైతు సంఘం నాయకులు మాజీ సర్పంచి జి ఆంజనేయులు, మధు, శ్రీధర్, వెంకటేశ్వర్లు, షాజహాన్, ఉల్చాల మద్దిలేటి, వెంకటయ్య, నాగన్న, భీమేష్, వెంకటేశ్వర్లు, అంజి, బషీర్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ఆర్‌పిల ఉద్యమం ఉధృతం

• సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమాదేవి, ఇతర నాయకులు • కలెక్టరేట్ ఎదుట ఆర్‌పిల ధర్నా • ఎఒ శివరాముడుకు వినతి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఆర్‌పిల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, మెప్మా ఆర్‌పిల ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమాదేవిలు హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎపి మెప్మా ఆర్ పి ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ ధర్నా వద్దకు కలెక్టరేట్ పరిపాలనాధికారి శివరాముడు వచ్చి వినతి పత్రం స్వీకరించారు. మెప్మా ఆర్‌పి ఉద్యోగులకు సంబంధించిన సమస్యల ను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రంలోని అంశాలను ఆయనకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సమస్యలను వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పిఎస్.రాధాకృష్ణ, పి.నిర్మల, రైతుసంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, సిఐటియు ఓల్డ్, న్యూ సిటీ నగర ప్రధాన కార్యదర్శులు విజయ్, నరసింహులు, ఐద్వా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్యామల, కె.అరుణ మాట్లాడారు. ఆర్‌పిలతో వెట్టిచాకిరి చేయించుకుంటూ కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. ఒక్కో ఆర్‌పికి నెలలో800, 2000, 3000, 4000 ఈ రకంగా వేతనాలు పడుతున్నాయన్నారు. తక్కువ వేతనాలతో వారి కుటుంబాలు ఏ రకంగా జీవించాలని ప్రశ్నించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్‌పిల జీతాలను వారి బ్యాంకు ఖాతాలకే జమ చేయడమే కాకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సిఐటియు న్యూసిటీ అధ్యక్షులు వై.నగేష్, సిఐటియు నాయకులు వి.వెంకటేశ్వర్లు, రియాజ్ బాషా, ఆర్‌పిల సంఘం జిల్లా ట్రెజరర్ సుజాత, ప్రసాద్, ఆర్‌పిలు కన్యక నాగేశ్వరి సంధ్యారాణి మంజుల శ్రీదేవి సుజాత బి.జ్యోతి రాజేశ్వరి నాగమణి కుమారి పర్వీన్ మద్దమ్మ వసుంధర అరుణ సేకున్ నాగేశ్వరి ఆర్‌పిలుపొదుపు మహిళలు పాల్గొన్నారు.

అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలి

- కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజా సమస్యలు పరిష్కార వేదికకు వచ్చే బాధితుల అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో పిజిఆర్ఎస్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ వినతులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం మరింత బాధ్యతతో పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా , నిష్పక్షపాతంగా పరిష్కరించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు అనురాధ, కొండయ్య సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ సిరి, జెసి నూరుల్ కమర్

హెచ్ఐవి బాధితుల పట్ల వివక్ష తగదు

సమాజంలో హెచ్ఐవి బాధితుల పట్ల వివక్ష తగదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ డే – 2025 సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ , నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుండి రాజ్ విహార్ సెంటర్ వరకు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ రాజు, డిసిహెచ్ఎస్ జాఫ్రుల్లా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.104.32 కోట్ల పంఛన్లు పంపిణీ

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పథకం కింద డిసెంబర్ మాసంలో జిల్లాలో అర్హులైన 2,37,733 మంది పెన్షన్ లబ్దిదారులకు రూ.104.32 కోట్లు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. సోమవారం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పంపిణీలో భాగంగా నగరంలోని కృష్ణనగర్‌లో ఉరుకుంద, వడ్డే నాగరాజులకు వికలాంగుల పింఛన్‌ను పుల్లమ్మ, చిన్న హుస్సేన్‌లకు, వృద్ధాప్య పెన్షన్, వసుంధర, లక్ష్మీదేవిలకు వితంతువు పింఛన్లను వారి ఇంటి వద్దకే వెళ్లి కలెక్టర్ అందజేశారు..కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు..

కృష్ణానగర్‌లో పింఛనుల పంపిణీ చేస్తున్న కలెక్టర్ సిరి

విఆర్ఒ అశోక్‌ను పట్టుకున్న ఎసిబి అధికారులు

నల్లచెలిమల విఆర్ఒపై
ఎసిబి దాడులు

- రూ.40 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

ప్రజాశక్తి- దేవనకొండ

పట్టాదారు పాసు పుస్తకం కోసం ఓ మాజీ సైనికుడి దగ్గర నల్లచెలిమల విఆర్ఒ అశోక్ రూ.40 వేల లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు దాడులు చేసి పట్టుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పత్తికొండ మండలం చందోలి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు శివకుమార్ తండ్రికి నల్లచెలిమల రెవెన్యూ పరిధిలో ఉన్న పొలానికి వారసత్వం మీద పట్టాదారు పాసు పుస్తకం కోసం ఇన్‌ఛార్జీ విఆర్‌ఒను సంప్రదించగా డబ్బులు డిమాండ్ చేశాడు. సోమవారం పత్తికొండ పట్టణంలోని డివిజన్ కోర్టుకు ఎదురుగా విఆర్ఒ అశోక్.. మాజీ సైనికుని నుంచి రూ.40 వేల లంచం తీసుకుంటుండగా ఎసిబి డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో అధికారులు దాడులు చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్టు చేశారు.

కెఎంసి పీజీ విద్యార్థులకు స్టేట్ ర్యాంకులు

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ పీజీ పరీక్షా ఫలితాల్లో కెఎంసి విద్యార్థుల ప్రతిభ చూపారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన మెడికల్ పీజీ ఫైనల్ ఇయర్ పరీక్షల్లో కర్నూలు మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్, ఫిజియాలజి, ఫార్మకాలజీ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు స్టేట్ సెకండ్ అండ్ థర్డ్ ర్యాంకులు సాధించడం పట్ల మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ సదరు విభాగం విద్యార్థులను, విభాగాధిపతులను అభినందించారు. ప్రిన్సిపల్‌ను కలిసిన కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సింధియా శుభప్రద, ఫిజియాలజీ విభాగాధిపతి డాక్టర్ సుధారాణి, ఫార్మకాలజి విభాగాధిపతి డాక్టర్ రాజేష్‌లను మంచి ఫలితాలు సాధించడం పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ అరుణ, డాక్టర్ రేణుక, డాక్టర్ డాక్టర్ రవి నాయక్, పుష్పలత, ప్రసన్న రాణి, నాగరాజు, ఫిజియాలజీ విభాగపు అసోసియేట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎలిజిబెత్ రాణి, డాక్టర్ ఉమా మహేశ్వరి, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ సురేష్ బాబు, డా బాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ర్యాంకులు సాధించిన పీజీ విద్యార్థులు కమ్యూనిటీ మెడిషన్ నుండి కొప్పోలు కీర్తన స్టేట్ సెకండ్ ర్యాంక్ (592) థియరీ లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఫిజియాలజీ విభాగం నుండి డాక్టర్ డి.మౌనిక స్టేట్ సెకండ్ ర్యాంక్, డాక్టర్ పి.యశ్వంత్ స్టేట్ థర్డ్ ర్యాంక్, ఫార్మకాలజీ విభాగం నుండి డాక్టర్ ఆర్. ధారణి స్టేట్ థర్డ్ ర్యాంక్ సాధించారు. ఫిజియాలజీ విభాగంలో 0.3 శాతం తో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ మిస్ అయిందని కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో రెండు మార్కులతో స్టేట్‌ఫస్ట్ ర్యాంకు మిస్‌అయిందని, రాబోయే సంవత్సరం ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేస్తామని అయా విభాగాధిపతులు పేర్కొన్నారు.

డాక్టర్ కొప్పల కీర్తన

డాక్టర్ మౌనిక

డాక్టర్ ధరణి

డాక్టర్ యశ్వంత్

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి -కోడుమూరు

కూటమి ప్రభుత్వం రాష్ట్రఅభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ప్యాలకుర్తి గ్రామంలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని గ్రామంలో ప్రతి ఇంటికి వెళుతూ అవ్వ తాతలకు, వికలాంగులకు, లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ గ్రామంలో కొత్తగా 3 విడో పింఛన్లు వచ్చాయన్నారు. నియోజకవర్గం మొత్తం మీద 37 విడో పింఛన్లు వచ్చాయన్నారు. సూపర్ సిక్స్ అమలు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. స్థానికులు డ్రెయినేజ్ సమస్య గురించి ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల అధ్యక్షులు లక్కిరెడ్డి రామకృష్ణారెడ్డి, ఎంపిడిఒ ఎసి రాముడు, రవీంద్రగౌడ్ , పట్టేమధు, నాయకులు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, అధికారులు, సచివాలయం సిబ్బంది, గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనుగొండ గ్రామంలో మండల టిడిపి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పింఛన్లను పంపిణీ చేశారు. కోడుమూరు ఎస్‌సి కాలనీలో మాల మునిస్వామి, కృష్ణాపురం గ్రామంలో కోడుమూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, కోడుమూరు 240, 242 బూత్‌లలో బలరాం, విఆర్ఒ ఎల్లప్ప పాల్గొన్నారు.

హరికిషన్‌కు కళామిత్ర సంస్థ పురస్కారం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

కర్నూలు జిల్లాకు చెందిన ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ సాహిత్యంలో చేసిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఒంగోలులోని ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన కళామిత్ర మండలి వార్షికోత్సవ సభలో అవనిగడ్డ ఎమ్మెల్సీ బుద్ధప్రసాద్, ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్, సిబిఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీ నారాయణల చేతుల మీదుగా సీతాదేవి పురస్కారాన్ని కళామిత్ర మండలి అధ్యక్షులు నూనె అంకమరావు అందించారు. డాక్టర్ ఎం.హరికిషన్ సామాజిక సమస్యలను కథల రూపంలో మలుస్తూ ప్రజలను చైతన్య పరచడమే గాక పిల్లలకోసం విశేషమైన కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఒత్తులు లేకుండా, సంయుక్త అక్షరాలు లేకుండా కథలు, గేయాలు, నవలలు రచించడమే గాక అంతరించిపోతున్న జానపద బాల సాహిత్యాన్ని సేకరించి ప్రచురిస్తున్నారని అందుకే ఈ పురస్కారాన్ని అందిస్తున్నామని తెలిపారు.

ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరి

-రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర ప్రసాద్
-మార్కెట్ యార్డ్, పట్టణ పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అసంక్రమిత వ్యాధుల 4.0 క్యాన్సర్‌సర్వే 18యేళ్లు పైబడిన వారందరికీ ఖచ్చితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ మహేశ్వర ప్రసాద్ అన్నారు. సోమవారం నగరంలోని మార్కెట్‌యార్డు, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్‌లో పరీక్షల వివరాలను అరా తీశారు. స్టాక్ రిజిస్టర్ చెక్ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఓపికగా మెరుగైన సేవలు అందించాలని రోగ నిర్ధారణ పరీక్షలు ఖచ్చితంగా చేయాలని తెలిపారు. ఆసుపత్రిలో మందుల కొరత రానీయకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోగులకు సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్.రఘు మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ అనేది నల్లిని పోలిన చిన్న కీటకం, ఈ కీటకం కుడితే శరీరంపై నల్లని మచ్చ, దద్దుర్లు ఏర్పడు తాయన్నారు. వారం, పది రోజుల తరువాత జ్వరం తలనొప్పి, కండరాల నొప్పులు, జీర్ణసమస్యల రూపంలో ఇన్ఫెక్షన్ బయటపడు తుందన్నారు. సకాలంలో గుర్తించి చికిత్స చేయించకపోతే తీవ్ర శ్వాస సంబంధిత సమస్యలు వస్తాయని తెలిపారు. దీనిని యాంటి బయాటిక్స్ ద్వారా చికిత్స అందించవచ్చన్నారు.

ఈ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహనా కల్పించాలన్నారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ , స్టాఫ్ నర్సు ల్యాబ్ టెక్నీషియన్ ఫార్మసిస్ట్ డేటా ఎంట్రి ఆపరేటర్ ప్రోజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన టి వెంకట్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కృషిచేసిన ప్రజల మనిషి అమరజీవి వెంకట్ 13వ వర్ధంతి సభ కార్మిక కర్షక భవన్‌లో సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ వర్ధంతి సభకు హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.నిర్మల, టి. రాముడు, ఎండి.అనంద్ బాబు, పార్టీ నాయకులు వెంకట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ కర్నూలు కార్పొరేషన్ ఇందిరాగాంధీనగర్‌లో బలహీనవర్గాల కుటుంబంలో పుట్టి యువజన సంఘం కార్యకర్తగా, కళాకారునిగా ప్రజలు ఎదుర్కొంటున్న బాధలను స్వయంగా చూసి తన జీవితాన్ని ప్రజాసేవ కోసం అంకితం చేశారన్నారు. పూర్తి కాలం కార్యకర్తగా, భారత ప్రజాతంత్ర యువజన సంఘం జిల్లా నాయకునిగా, వృత్తిదారుల జిల్లా సమన్వయ కమిటీ నాయకునిగా సిపిఎం నగర కమిటీ సభ్యునిగా అనేక బాధ్యతలో పని చేశారన్నారు. పార్టీనాయకులు ఇందిరాగాంధీనగర్, భగత్ సింగ్ నగర్, రోజీ ఏరియా ఎక్కడ బాధ్యత ఇస్తే అక్కడ పనిచేస్తూ ప్రజాసమస్యలపై పోరాటం చేశాడని అన్నారు. పేదలుఇళ్ళ బాడుగలు కట్టుకోలేక పడుతున్న ఇబ్బందులను చూసి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం పొరంబోగు స్థలాలలో ఇల్లు లేని పేదలకు గుడిసెలు వేయించి పేదల సొంతఇంటి కల నెరవేర్చిన మహానుభావుడని అన్నారు. డిసెంబర్ ఒకటో తేదిన ప్రమాదంలో మరణించాడన్నారు. ఆయన జీవితం యువతకు ఎంతో ఆదర్శమన్నారు. వెంకట్ చూపిన మార్గంలో యువత పయనించా లన్నారు. సిపిఎం నగరకార్యదర్శివర్గ సభ్యులు, సిహెచ్.సాయిబాబా, అర్.నరసిహులు, కె.సుదాకరప్ప, పిఎన్ఎం జిల్లానాయకులురాజు, లోకేష్, పార్టీనగర నాయకులు ఎం.బాస్కర్, రోషయ్య, శేషాద్రి, శ్రీనివాసులు, మాబుసా, శాంతి జిల్లా అద్యక్షకార్యదర్శులు రాఘవేంద్ర,అబ్దుల్లా, ముని స్వామి, కెవిపిఎస్ నాయకురాలు, విజయమ్మ, సూరి తదితరులు పాల్గొన్నారు.

వెంకట్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు నిర్మల, రాముడు, రాజశేఖర్

మంత్రి భరత్ పై బురదజల్లే ప్రయత్నం మానండి

-కర్నూలు అభివద్ధికి సహకరించండి -వైసిపికి టిడిపి నేతల సూచన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి టిజి భరత్‌పై వైసిపి నాయకులు బురదజల్లే ప్రయత్నాన్ని మానుకోవాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు నగర అధ్యక్షులు నాగరాజ్ యాదవ్ అన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన టిడిపి నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, కార్పొరేటర్ జాకీర్ అన్సారి అబ్బాస్, కురువ పరమేష్, క్రాంతికుమార్, శ్రీధర్‌తో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర మంత్రి టిజి. భరత్ కర్నూలును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు, జిల్లాకు పరిశ్రమలు తీసుకొని వచ్చేందుకు అహర్నిషలు పాటుపడుతున్నారన్నారు. దానిని జీర్ణించుకోలేని కొంతమంది వైసిపి నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు టిజి. భరత్ పై లేని పోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. నగరంలో ఎబిసి క్వార్టర్స్ విషయంలో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. . హైకోర్టు బెంచ్‌ను సాకుగా చూపి స్థలాలను కాజేసేందుకు మంత్రి కుట్రలు చేస్తున్నారంటూ వైసిపి నాయకులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. దాదాపు 70 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఎబిసి, కాంపులోని క్వార్టర్స్ సిథిలావస్తలో ఉన్నాయని, కొన్ని వైసిపి వారు అక్రమించుకొని వాటిని అధిక మొత్తంలో బాడుగలకు ఇచ్చి పబ్బం గడుపుకొంటున్నారన్నారు. అందువల్ల నేడు వాటిని ఖాళీ చేసేందుకు నానా సాకులు చూపుతున్నారని అన్నారు. ఈ క్వార్టర్స్ ఉన్న వారు గత సంవత్సరం క్రితమే అక్కడినుండి ఖాళీ చేసేందుకు తమ అంగీకారం తెలిపారన్నారు. వైసిపి వారిని ఉసిగొలిపి ఏదో రకంగా టిడిపిని అపవాదు వచ్చేలా చేయాలని కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ప్రజలు వైసిపి వారి మాటలను పరిగణలోకి తీసుకోవద్దని, నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇప్పటికైనా వైసిపి వారు కుట్రలు మానుకొని ప్రస్తుతం అభివృద్ధి పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు మంచాలకట్ట బాస్కరరెడ్డి, సత్రం రామ క్రిష్ణుడు, రాజశేఖర్ యాదవ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎంపిడిఒ కు వినతిపత్రం ఇస్తున్న నారాయణ, తదితరులు

ఉపాధి పనులు కల్పించాలి

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎపి వ్య కా సం ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

గ్రామీణ ప్రాంతాల్లో అన్ని గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంకింద పనులు కల్పించాలని, కార్పొరేషన్‌లో విలీనమైన పెద్దపాడు, పందిపాడు, లక్ష్మీపురం పంచాయతీలలో గ్రామీణ ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి నారాయణ డిమాండ్ చేశారు. కల్లూరు ఎంపిడిఒ కార్యాలయ ముందు ధర్నాకు సంఘం మండల నాయకులు కె.శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి నారాయణ గారు, సిఐటియు మండల కార్యదర్శి కె.మధు, మాట్లాడుతూ గత ఐదు నెలలుగా గ్రామాల్లో పనిచేసిన ఉపాధి హామీ కూలీలకు నేటికీ వేతనాలు రాలేదన్నారు. వ్యవసాయ పనులు తగ్గు ముఖం పట్టి పనులు లేక పట్టణాల్లో భవన నిర్మాణ కార్మికుల పనులకు వెళ్లాలన్న అక్కడ పనులు లేకపోవడంతో గ్రామాల్లో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అడిగిన వారందరికీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. పనిచేసిన వారంలోగా వేతనాలు ఇవ్వాలని, రెండు పూటల పని విధానాన్ని రద్దు చేయాలని, గ్రామాల్లో జాబ్ కార్డు లేని వాళ్లందరికీ జాబ్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ పై డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్పొరేషన్‌లో వెళ్లిన గ్రామాల అంశం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అక్కడుండే పేదలకు పనులు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మండల నాయకులు షేక్షావలి, రాజు, యేసు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరిస్తే ప్రాణాన్ని కాపాడుతుంది

ప్రజాశక్తి- సి బెళగల్

హెల్మెట్ ధరించడం వలన ప్ర యాణ వేళ ప్రమా దాలు జరిగినప్పుడు ప్రాణాలను కాపాడు తుందని ఎస్ఐ వేణుగోపాల్ రాజు పేర్కొన్నారు. సోమవారం విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్నప్పుడు హెల్మెట్ ప్రాణ కవచమని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రయాణాలు చేసేటప్పుడు ప్రమాదవషాత్తు ప్రమాదాలు జరుగుతుంటాయని హెల్మెట్ పై అవగాహన కల్పించారు. ప్రతి ఇంట్లో మన కోసం ఎదురు చూస్తుంటారన్న విషయంతో బయటకు వెళ్లి సురక్షితంగా ఇంటికి రావాలని కాంక్షించారు.

హెల్మెట్ ధారణపై విద్యార్థులతో అవగాహన ప్రదర్శన

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



కపాస్ యాప్‌ను రద్దు చేయాలి

- వామపక్షాల డిమాండ్

ప్రజాశక్తి - దేవనకొండ

ఉత్పత్తులను సిసిఐకి విక్రయించాలనుకున్న పత్తి రైతులకు కపాస్ యాప్ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, స్లాట్ బుక్ కావడం లేదని కపాస్ యాప్‌ను రద్దు చేసి టోకెన్ పద్ధతిని ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, సిపిఐ మండల కార్యదర్శి నరసారావు డిమాండ్ చేశారు. సోమవారం వివిధ గ్రామాల రైతులతో కలిసి వామపక్ష నాయకులు వ్యవసాయ శాఖాధికారి కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు యూసుఫ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు పత్తిని విక్రయించడానికి ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కపాస్ యాప్ ద్వారా స్లాట్ మీద లెక్కపెట్టి స్లాట్స్ మాత్రమే బుక్ అవుతున్నాయని తెలిపారు. రైతులంతా సచివాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం దగ్గర పడిగాపులు కాస్తూ ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సిసిఐ కొన్నట్లుగా ఆయా ప్రాంతాల రైతులు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అనుసంధానంతో టోకెన్ సిస్టం ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలో పత్తిని విస్తారంగా సాగు చేశారని, దేవనకొండలో సిసిఐ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉల్లి, పత్తి పంటలకు కనీస మద్దతు ధరను మరింత విస్తృతం చేయాలని కోరారు. నాయకులు అశోక్, మహబూబ్ బాషా, బజారి, గజుల శ్రీనివాసులు, పాలచంద్ర, శంకర్, కోమేష్, మహేంద్ర, నాగేంద్ర, సుధాకర్, బలరాముడు, రంగడు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే బీవీ

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎయిడ్స్ పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్, జూనియర్ కళాశాలలో స్థానిక విజయ మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం బాలికల ప్రభుత్వ హైస్కూల్ నుంచి మాచాని సోమప్ప సర్కిల్ వరకు ఎయిడ్స్ అవగాహన ర్యాలీలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ... ఎయిడ్స్‌పై అవగాహన పెరగడం చాలా ముఖ్యమని, హెచ్ఐవి ఒక వ్యాధి మాత్రమేనని తెలిపారు. విజయ మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వేణుగోపాల చారి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఎఎం.ఆది నగేష్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, పట్టణ సిఐ శ్రీనివాసులు, విజయ మహిళా మండలి సిఇఒ ఓంకారమాచారి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రామకృష్ణ నాయుడు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఆవరణంలో ఎయిడ్స్ నివారణ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి పి.హేమ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సఫారున్నీసా బేగం, న్యాయవాదులు కృష్ణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రాధ, నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ న్యాయవాదులు లింగమూర్తి, సాల్మన్, పిఎన్ఆర్.ప్రసాద్, కృష్ణ, కోర్ట్ కానిస్టేబుల్ రామాంజనేయులు, కోర్టు సిబ్బంది రాజు, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహేశ్వరి పాల్గొన్నారు. **చిప్పగిరి** జూనియర్ కళాశాల విద్యార్థులతో కళాశాల నుంచి బస్టాండ్, అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, విద్యార్థుల చేత ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని, ఎయిడ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. చిప్పగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు, ప్రభుత్వాస్పత్రి డాక్టర్ పార్వతి, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు మాట్లాడారు. విచ్చలవిడి శృంగారం అనర్థాలకు మూలమవుతుందన్నారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, ఎయిడ్స్ అంటించుకునే వ్యాధి అని, ఎయిడ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు.

చిప్పగిరిలో మాట్లాడుతున్న అధికారులు

ఈ-క్రాప్ ద్వారా కొనుగోలు చేయాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేసి, ఈ-క్రాప్ ద్వారా పత్తి పంటను కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉల్లి పంటకు నష్ట పరిహారంతో పాటు కొనుగోలు చేసిన ఉల్లి పంటకు నగదును రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. వరి, వేరుశనగ, ఉల్లి, మొక్కజొన్న పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. నెల క్రితం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ సిసిఐ నిబంధనల వల్ల చాలామంది పత్తి రైతులు తక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. తేమ శాతం ఎక్కువ ఉందని, పత్తి పంట రంగు మారిందని, గుగ్గి ఉందని కొనుగోలు చేయకుండా రైతులను తిరిగి పంపుతున్నారని తెలిపారు. కపాస్ కిసాన్ యాప్ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. యాప్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు అయ్యప్ప, బాష, కౌలు రైతు సంఘం నాయకులు దస్తగిరి బాష, సత్యనారాయణ రెడ్డి, వ్యకాస జిల్లా నాయకులు లింగన్న పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. రైతు సంఘం నాయకులు సురేష్ అధ్యక్షత వహించారు. రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, లక్ష్మీ నరసయ్య, రైతు సంఘం నాయకులు గోవిందు, రాముడు, సుభాన్, స్వామి, నామాల రాముడు, రాజు, సుమాల రాజు పాల్గొన్నారు. **మంత్రాలయం** తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ కె.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్.వీరేష్, సిపిఎం నాయకులు హెచ్.జయరాజు, కెవిపిఎస్ నాయకులు బి.అనిల్, వ్యకాస నాయకులు టి.ప్రాణేష్, రైతులు కె.యోగప్ప, ఖాసీం బాబు, తాయన్న, నరసింహులు పాల్గొన్నారు. **నందవరం** తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం నాయకులు దేవపుత్ర మాట్లాడుతూ... యూరియా ఇవ్వడంలో మండలంలోని కొన్ని ఫెర్టిలైజర్ యజమానులు లింకు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారని రైతులు తహశీల్దార్‌కు తెలిపారు. తహశీల్దార్ స్పందిస్తూ... అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు రాముడు, దస్తగిరి, రామాంజనేయులు, రామకృష్ణ, రంగముని, పెద్ద ఈరన్న పాల్గొన్నారు.

ఆదోనిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


మంత్రాలయం

నందవరం

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బీవీ

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ బాలికల పాఠశాలలను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి సందర్శించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి, పాఠశాల పరిస్థితులపై అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరా సమస్యలు, తాగునీటి సమస్య, భవనాలు, ప్రాథమిక వసతులు వంటి అంశాలను ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే బీవీ పూర్తిగా పరిశీలించి, వెంటనే సంబంధిత అధికారులు, శాఖలకు ఆదేశాలు జారీ చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. విద్యార్థుల చదువు, భద్రత, శ్రేయస్సుపై ప్రభుత్వం దృష్టి సారించిందని, అవసరమైన అన్ని వసతులు అందుబాటులోకి వస్తాయని హామీ ఇచ్చారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.15 లక్షలు : ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

కురవల సౌకర్యార్థం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరయినట్లు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో కురువ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎంపీ నిధుల కింద మంజూరైన రూ.15.20 లక్షల నగదు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని, వైసిపి మండల అధ్యక్షులు భీమారెడ్డిని గ్రామస్తులు శాలువా, గజమాలతో సన్మానించారు. పూజారి బీరప్ప, పూజారి గులేప్ప, పూజారి ముకరప్ప, పూజారి నరసప్ప, పూజారి నాగప్ప, మాజీ ఎంపిటిసి రఘునాథ్ రెడ్డి, చంద్రప్ప రెడ్డి, సర్పంచి ముకరన్న, శ్రీనివాసులు, మల్లయ్య, అయ్యప్ప, నాగిరెడ్డి, అబ్బిలి ఈరన్నప్ప, గడ్డ ముకరప్ప, వీరేష్, కొలిమి నాగిరెడ్డి, డబ్బా నాగిరెడ్డి, బోడబండ లక్ష్మన్న, బూలప్ప, నారాయణ, ఒంటే నాగిరెడ్డి, ముద్ద రాముడు, మొండి నరసింహులు, లింగన్న, భీమన్న, వీరేష్, నర్సన్న, పెద్ద నరసింహులు, చిన్న నరసింహులు, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

వరద కాలువ నిర్మించాలి

- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మించి, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షాకాలంలో వృథా అవుతున్న నదీజలాలను సద్వినియోగం చేసుకోవడానికి వరద కాలువ నిర్మించాలని కోరారు. ఈ నీటి ద్వారా నియోజకవర్గంలోని చెరువులతో పాటు, ఆదోని మండలం బల్లేకల్, పాండవగల్ కొండల్లో 5 టిఎంసిల వరకు నీటిని నిల్వ చేయవచ్చన్నారు. తుంగభద్ర నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపడితే రెండు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాలు పెరిగి వాణిజ్య రంగం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం స్పందించి జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలసలు నివారించడానికి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి కృషి చేయాలని కోరారు. వీరేష్, హనుమంతు, లింగన్న, వలీ, సత్యప్ప, రామలింగ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధి పనులు కల్పించాలి : వ్యకాస

ప్రజాశక్తి - ఆస్పరి

గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఉపాధి పనులు కల్పించి, పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం వ్యకాస ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ గీతా వాణి, ఏపీవో రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో వ్యవసాయ పనుల్లేక ఉపాధి పనులు కల్పించక పోవడంతో సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు గుర్తించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. సక్రమంగా పనులు కల్పించి, రెండుపూటలా హాజరు రద్దు చేసి, ఒకేసారి హాజరు వేసేలా చూడాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి రవి, వ్యకాస నాయకులు గాది లింగ, కృష్ణ, రామకృష్ణ, విష్ణు, జయ రాముడు, జాకీర్, రాము పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో టిడిపి కార్యాలయ నిర్మాణానికి పార్టీ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. సోమవారం స్థానిక నల్ల వాగు సమీపంలో చెత్త సంపద కేంద్రం వద్ద రెవెన్యూ అధికారులతో కలిసి స్థలం గురించి అడిగి తెలుసుకున్నారు. సంబంధిత భూమి సర్వే నెంబర్, ఎంత ఉందనే వివరాలు సేకరించారు. సర్వే నిర్వహించి ఎంత ప్రభుత్వ భూమి ఉందనే విషయాన్ని తెలుపుతామని రెవెన్యూ అధికారులు తెలిపారు. త్వరగా చేసి తగిన సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు. ఆర్ఐ జనార్ధన్ రావు, మండల సర్వేయర్ అశోక్, విఆర్ఓ భీమనగౌడ్, విఆర్ఎ నరసయ్య, టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు, ఎంపిటిసి మేకల

స్థలాన్ని పరిశీలిస్తున్న రాఘవేంద్రరెడ్డి

వెంకటేష్, ఉన్నత పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ మద్రి నరసింహ, న్యాయవాది విజయ్ కుమార్, నాయకులు మంగళి మల్లికార్జున, ఆర్‌కె.రాఘవేంద్ర, రామచంద్ర, డేవిడ్, రాజు, పేతూరు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ కోరారు. సోమవారం మండలంలోని కె.నాగలాపురం ఎంపిపి పాఠశాల సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ మండల నాయకులు వై.కృష్ణ, ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఉపాధ్యాయులు నాగేంద్ర మణి, గ్రామ పెద్దలు లక్ష్మన్న, జయరాముడు, శివ పాల్గొన్నారు.

యువత క్రీడా నైపుణ్యం ప్రదర్శించాలి

- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

యువత క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించాలని టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య తెలిపారు. క్రిస్మస్ పండగ సందర్భంగా హాల్వి గ్రామంలో సోమవారం క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో పండగల సందర్భంగా క్రీడలు నిర్వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని తెలిపారు. యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. స్నేహభావం, శారీరక ఉల్లాసం, సత్సంబంధాలు పెరుగుతాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కురువ వీరేష్, చూడి నాగరాజు, ఈడిగ హనుమంతు, చాకలి హనుమంతు, సోము, తిక్కా రెడ్డి, సురేష్, బుజ్జి, రాజు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఉల్లిగయ్య

జిల్లాతోనే అభివృద్ధి

- ధర్నాలతో దద్దరిల్లిన ఆదోని

ప్రజాశక్తి - ఆదోని

జిల్లాతోనే ఆదోని అభివృద్ధి సాధ్యమనే నినాదాలతో హోరెత్తించారు. 15 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం గుర్తించడం లేదంటూ నినాదాలు చేశారు. సోమవారం జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ మైదానం నుంచి మున్సిపల్ రోడ్డులో భారీ ప్రదర్శన చేపట్టారు. మున్సిపల్ రోడ్డులో బైఠాయించడంతో వాహనాలు బారులుతీరి ట్రాఫిక్ స్తంభించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల నాయకులు నినాదాలు చేయడంతో పోలీసులకు, ఆందోళనకారులకు వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సాధన కమిటీ సభ్యులు కలుగజేసుకొని ప్రదర్శనను ముందుకు సాగించారు. భీమాస్ కూడలిలో రాస్తారోకో నిర్వహించి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. సాధన కమిటీ సభ్యులు నూర్ అహ్మద్, లలిత కృష్ణమూర్తి, రఘురామయ్య, దస్తగిరి నాయుడు, దేవిశెట్టి ప్రకాష్, విట్టా రమేష్, వీరేష్, తిరుమలేష్, ఉదయ్ సబ్ కలెక్టర్ అజయ్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. పరిశ్రమలు రావాలన్నా, విద్యాపరంగా అభివృద్ధి జరగాలన్నా జిల్లా సాధనతోనే సాధ్యమని వారు తెలిపారు. ప్రభుత్వానికి వినతిపత్రం పంపుతామని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్ తెలిపారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ శాంత, నాయకులు కోదండ, గోపాల చారి, శ్రీదేవి, అశోక్ నంద రెడ్డి ఉన్నారు.

గ్రామాలను పెద్దహరివాణంలో కలపొద్దు : ఆదోని మండలం నుంచి కొత్త మండలంగా పెద్దహరివాణం ఏర్పాటు స్వాగతిస్తున్నామని, అశాస్త్రీయంగా గ్రామాలను కొత్తగా ఏర్పడే పెద్దహరివాణంలో కలపడం సమంజసం కాదంటూ నినదించారు. ఆదోని మండలంలోనే గ్రామాలు ఉండాలని, కొత్తగా ఏర్పడే పెద్దహరివాణంలో కలపొద్దు అంటూ గ్రామాల నుంచి పాదయాత్రగా ఆదోనికి చేరుకున్నారు. కొత్త బ్రిడ్జి నుంచి శ్రీనివాస భవన్, భీమా సర్కిల్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ చేరుకున్నారు. ఢణాపురం, నారాయణపురం, చాగి, గణేకల్లు, గోనెహాలు గ్రామస్తులు నిరసనలో పాల్గొన్నారు. ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండానే ఏకపక్షంగా అధికారులు పెద్దహరివాణం మండలంలో కలపడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పెద్దహరివాణం వెళ్లాలంటే 30 కిలోమీటర్ల దూరం అవుతుందని, ఇదెక్కడ న్యాయమంటూ గనేకల్లు గ్రామస్తులు నినదించారు. కూటమి ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలను స్వాగతిస్తే ప్రజాప్రతినిధుల ఇల్లు ముట్టడిస్తామని టిడిపి నాయకులు చిన్న గోనెహాలు గోపాల్ రెడ్డి హెచ్చరించారు. నాయకులు రామస్వామి, షేక్షావలీ, వెంకటేష్ చౌదరి, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లా చేయాలని సాధన కమిటీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన

నూతన మండల కమిటీ నాయకులు

బాలుర వసతి గృహం ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో బాలుర సంక్షేమ వసతి గృహం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సోమవారం ఎస్ఎఫ్ఐ మండల మహాసభ నాయకులు పవన్ అధ్యక్షతన నిర్వహించారు. యుటిఎఫ్ నాయకులు నరసింహ, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఖాజా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాయి ఉదయ్ మాట్లాడుతూ... మండలంలోని చాలా గ్రామాల్లో పాఠశాలలకు సరైన గదుల్లేక విద్యార్థులకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. చెట్ల కింద లేదా ఖాళీ ప్రదేశాల్లో కూర్చొని చదువు చెప్పాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. మండలంలో అనేక గ్రామాల్లో పాఠశాలలు పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టకపోవడం వల్ల విద్యార్థులు చదువుకోవడానికి సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మండలంలో వలస వెళ్లే తల్లిదండ్రులు విద్యార్థులను సంక్షేమ గృహంలో చేర్పిస్తే ఉన్నత చదువులు చదువుతారని ఆశతో ఉన్నారని, మండలంలో బాలుర వసతి గృహం లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను కూడా వలస తీసుకెళ్తున్నారని తెలిపారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సోమశేఖర్, పవన్, మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఆదోని

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ పోరాడుతోందని జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఎస్ఎఫ్ఐ పట్టణ సమావేశంలో పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా సంజయ్ కుమార్, కార్యదర్శిగా శశిధర్, ఉపాధ్యక్షులుగా లోకేష్, ఉమాకాంత్, చిరు, సహాయ కార్యదర్శులుగా అలీ బాష, ఉచ్చీరప్ప, రిషి, 11మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు శివ, నరసింహ, సంజయ్, కిరణ్, బండి లోకేష్ కుమార్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

- గణేకంటి రామకృష్ణ

ప్రజాశక్తి - మంత్రాలయం

ఉపాధి కల్పనకు ప్రభుత్వం మంజూరు చేసిన జాబ్ కార్డులను తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్ పద్మావతిపై చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ నూర్జహాన్‌ను బాధితుడు గణేకంటి రామకృష్ణ కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... గతంలో తమ కుటుంబంలోని 8 మందికి సభ్యులకు జాబ్ కార్డులను మంజూరు చేశారని, ఉపాధి పనులకు వెళ్తున్నామని తెలిపారు. నూతనంగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన పద్మావతి ఈకేవైసీ కోసం తమకు సమాచారం ఇవ్వకుండా, ఇంటి దగ్గర ఎవరూ లేరంటూ తమ జాబ్ కార్డులను రద్దు చేశారని చెప్పారు. కనీసం అంగవైకల్యం ఉన్న తనపై దయ కూడా చూపకుండా, తాము టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి గ్రూపు అని భావించి రాజకీయ కుట్రతో జాబ్ కార్డులు తొలగించారని తెలిపారు. గృహ నిర్మాణానికి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోలేక పోయామని చెప్పారు. సుమారు 600 కార్డులు రద్దయినట్లు తెలిసిందని, సక్రమంగా విధులు నిర్వర్తించని ఇలాంటి వారికి ఏపీవో మద్దతుగా నిలిచారని తెలిపారు. మళ్లీ దరఖాస్తు చేశామని మళ్లీ వస్తాయని చెప్పడం బాధకరమన్నారు.

'రెండేళ్లుగా వేతనం లేకుండా పనిచేస్తున్నా'

ప్రజాశక్తి - ఆస్పరి

రెండేళ్లుగా తాను వేతనం లేకుండా విఒఎగా పనిచేస్తున్నా ఎపిఎం తనకు జీతం ఇవ్వకుండా ఆపుతున్నారని ఆస్పరి గ్రామానికి చెందిన విఒఎ జయలక్ష్మి తెలిపారు. సోమవారం స్పందనలో కలెక్టర్ డాక్టర్ సిరికి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ... ఆంజనేయ స్వామి గ్రామైఖ్య సంఘంలో 78 పొదుపు సంఘాలు ఉండగా, 30 ఎస్‌హెచ్‌జి గ్రూపులను విడదీసి సంగమేశ్వర గ్రామైఖ్య సంఘాన్ని నూతనంగా ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు ద్వారా రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నామన్నారు. బయోమెట్రిక్ అప్రూవల్ అయినా ఎబిఎన్ లాగిన్ ఇవ్వడం లేదన్నారు. విఒఎ బాధ్యతలు పూర్తిగా నిర్వహించేందుకు తనకు లాగిన్ ఇవ్వకుండా అధికారులు కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

'శాస్త్రీయ విభజన కోరాం'

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండల పరిపాలనా వ్యవస్థలో శాస్త్రీయ విభజన కోరామని కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, పెద్దహరివాణం మండల సాధన కమిటీ సభ్యులు ఆదినారాయణ రెడ్డి, రాఘవేంద్ర ఆచారి, సర్పంచి రామన్న, మెడికల్ నాగరాజు, కుప్పలదొడ్డి గర్జప్ప, రంగారెడ్డి, మధు, కరెప్ప, సున్నుసాబ్, బండి తిమ్మప్ప, ఆది శేషిరెడ్డి, కుప్పలదొడ్డి పరమేష్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో వారు మాట్లాడారు. ఆదోని జిల్లాతో పాటు పెద్దతుంబలం, పెద్దహరివాణం, మరో ఏ గ్రామాన్ని అయినా మండలంగా ప్రకటించాలని కోరామన్నారు. పెద్దహరివాణం గ్రామానికి 10 నుంచి 12 కిలోమీటర్లలోపు ఉన్న సంతేకుడ్లూరు, యడవల్లి, బలాదూరు, చిన్నగోనెహాలు, చిన్నహరివాణం, హానవాళు, హోళగుంద మండలం గజ్జహల్లి, వందవాగిలి, ఇంగలదహల్, ఎండి.హళ్లి, పెద్దగోనెహళ్, కౌతాళం మండలం కుంటనల్ గ్రామాన్ని కలుపుకొని మండల ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. పెద్దహరివాణం గ్రామంలోనే సుమారు 7,500 మంది ఓటర్లు ఉన్నామని చెప్పారు. కొన్ని గ్రామాల ప్రజలు పెద్దహరివాణం గ్రామం దూరమవుతుం దని అభ్యంతరాలు తెలుపుతున్నారని అన్నారు. నాగరాజ్ శెట్టి, మల్లికార్జున శెట్టి, పంచర్ బెల్ గజప్ప, మారెప్ప, షేకప్ప, గురులింగ, రంగస్వామి, సిద్ధ పాల్గొన్నారు.

పెద్ద హరివాణంలో కలపాలి : గ్రామస్తులు

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పెద్దహరివాణం మండలంలో హోళగుంద మండలం ఇంగలదహల్, ఎండి.హళ్లి, పెద్దగోనేహాల్, గజ్జహల్లి, వందవాగిలి గ్రామాలను చేర్చాలని ఎండి.హళ్లి సర్పంచి సుధాకర్, ఇంగలదహల్ సర్పంచి వెంకటరామిరెడ్డి, వెంకట రాముడు, పూజారి రామలింగ, హారున్ బాష, వడ్డే విశ్వనాథ్ రాజు, వడ్డే బ్రహ్మయ్య, ఎర్రిస్వామి కోరారు. సోమవారం తహశీల్దార్ రమేష్‌కు, సబ్ కలెక్టర్ అజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... పెద్దహరివాణం మండలం ఈ 5 గ్రామాలకు 8 కిలోమీటర్ల దూరంలోనే ఉందని, బస్సు సౌకర్యం కూడా ఉందని తెలిపారు. హోళగుంద మండలానికి దాదాపు 15 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉందని, కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేదని చెప్పారు. గ్రామాల ప్రజలు అనిల్ స్వామి, ఖాదర్ బాష, మాధవస్వామి, శరణప్ప, తలారి చంద్ర, డిసి.బొజ్జన్న, ఓమయ్య, మహ్మద్, రామలింగ, భీమా, మద్దతుగా పెద్దహరివాణం మండల ప్రజలు ఆదినారాయణ రెడ్డి, మెడికల్ నాగరాజు, కుప్పలదొడ్డి గర్జప్ప, కరెప్ప, రేణుకచారి స్వామి, బండి తిమ్మప్ప, గొరవ ఈరన్న, బసప్ప పాల్గొన్నారు.

వాగుపై రోడ్డు ఏర్పాటుకు కృషి : టిడిపి

ప్రజాశక్తి - మంత్రాలయం

పొలాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు రైతుల కోసం నల్ల వాగుపై మట్టి రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు పార్టీ పట్టణ ఇన్‌ఛార్జీ బి.వరదరాజులు తెలిపారు. సోమవారం గ్రామ సమీపంలో ఉన్న నల్ల వాగును, వాగు చుట్టూ మళ్లకంపను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... నల్లవాగులో డ్రెయినేజీ నీరు ప్రవహిస్తోందని, రైతులు పొలాలకు వెళ్లాలంటే ఈ నీటిలోనే నడవాల్సి వస్తోందని తెలిపారు. ఇదే దారి గుండా నందవరం మండలం ఇబ్రహీంపురం, మాచాపురం, నందవరం వెళ్లొచ్చని చెప్పారు. ఎంపిటిసి వెంకటేష్, మద్రి నరసింహ, రాజు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

- ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి

ప్రజాశక్తి- దేవనకొండ

రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం టిడిపితోనే సాధ్యమని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి తెలిపారు. సోమవారం మండలంలోని కరివేముల గ్రామంలో ఆమె పర్యటించి, లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయని తెలిపారు. గ్రామంలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రజలు వైకుంఠం జ్యోతికి వివరించారు. అందుకు స్పందించిన ఆమె సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఎంపిడిఒ జ్యోతి, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, రామారావు నాయుడు, గిడ్డయ్య గౌడ్, మల్లికార్జున గౌడ్, కప్పట్రాళ్ల మల్లికార్జున, శాంతి కుమార్, కరివేముల వీరేష్, మాజీ సర్పంచి బడేసాబ్, తెర్నేకల్ చిన్న వెంకప్ప, బాటమీద రాజు, సర్పంచులు నాగరాజు గౌడ్, భాస్కర్, చిన్న రామప్ప, మహేశ్వర రెడ్డి, జనసేన నాయకులు బోయ సరోజ, రామాంజినేయులు, కటిక ఉచ్చీరప్ప, టిడిపి పి.కోటకొండ నాయకులు రామలింగడు, చిట్యాల రామాంజనేయులు, మునిరంగడు పాల్గొన్నారు. **కోసిగి**లోని 9వ వార్డు మైనారిటీ కాలనీలో పింఛన్ల పంపిణీకి టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల కన్వీనర్ పల్లెపాడు రామిరెడ్డి అధ్యక్షతన టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ మహబూబ్ బాష ఆధ్వర్యంలో వృద్ధులకు, వికలాంగులకు పింఛను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలు విని, విధానాన్ని పరిశీలించి, ప్రతి లబ్ధిదారునికీ ప్రభుత్వం అందించే సంక్షేమం వేగంగా చేరేలా చూడాలని అధికారులకు సూచనలు చేశారు. మైనారిటీ నాయకులు తంకం గౌస్, కలందర్, గౌస్, నూరి, సద్దాం, యూనుస్ పాల్గొన్నారు. **నందవరం** మండలంలోని వివిధ గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. పేదలకు ఇబ్బంది కలుగకుండా ఇంటి దగ్గరికి వెళ్లి క్రమం తప్పకుండా ప్రతి నెలా 1వ తేదీన పింఛను ఇస్తున్నట్లు తెలిపారు. నాగలదిన్నెలో మైనార్టీ నాయకులు ఎన్.ఎ.జబ్బార్, టిడిపి గ్రామ అధ్యక్షులు ఈరన్న, శేషాద్రి తిమప్ప, గ్రామ ఉపాధ్యక్షులు ఎన్.ఎ.మునాఫ్, రవిగౌడ్, శాంతి, వీరేష్, దుబ్బన్న, పౌలు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని 30వ వార్డులో టిడిపి పట్టణ కమిటీ ఆర్థిక కార్యదర్శి విజయలక్ష్మి పింఛన్ల పంపిణీ చేపట్టారు.

ఎమ్మిగనూరులో...

నందవరంలో

దేవనకొండ : మాట్లాడుతున్న వైకుంఠం జ్యోతి

కోసిగిలో రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం.537/2024 in ఎ.యస్.నెం. /2024
వి.రాజేశ్వరి ... అర్జీదారు/అప్పిలెంటు
-వర్సెస్-
వి.రామదాసు (Died by his L.Rs)
ఆర్.3. వి.లక్ష్మి భర్త లేటు వి.రామదాసు,
ఆర్.4. వి.రాజరాములు తండ్రి లేటు వి.రామదాసు,
ఆర్.5. వి.సురేంద్ర తండ్రి లేటు వి.రామదాసు,
ఆర్.6. వి.దేవి తండ్రి లేటు వి.రామదాసు,
అందరి నివాసము.కొట్టాల గ్రామం, వెల్దుర్తి మండలం, కర్నూలు జిల్లా. ... రెస్పాండెంట్లు
రెస్పాండెంట్లు నెం.3 నుండి 6 వరకు నోటీసులు
ఇందుమూలముగా పైన కనబరచిన ఐ.ఎ.నెం.537/2024 లో 3 నుండి 6 రెస్పాండెంట్లు అయిన మీకు తెలియజేయడం ఏమనగా పై అర్జీలో అప్పీలు వేయడానికి అయిన delay ను condone చేయమని కోరుతూ పై అర్జీని వేసియున్నారు. కావున సదరు విషయమై 3 నుండి 6 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణ ఉన్న యెడల 16-12-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరుకాని మీ తరపున అడ్వకేటు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలయును. లేని యెడల సదరు అర్జీ నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.
కోర్టు వారి ఉత్తర్వు మేరకు
తేది : 16-12-2025
కె.లోకేశ్వరరెడ్డి
వాది పరం అడ్వకేటు
కర్నూలు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No : 528/2023
షేక్ జైనబీ .. వాది
వర్సస్
షేక్ అబ్దుల్ గఫూర్ .. ప్రతివాది
To
ప్రతివాది చిరునామా
షేక్ అబ్దుల్ గఫూర్ తండ్రి ఖాసిం సాహెబ్,
వయస్సు 60 సంవత్సరాలు, వ్యాపారం,
నివాసం కల్లూరు గ్రామం, కల్లూరు మండలం,
కర్నూలు జిల్లా.
వాది మీపైన పర్మనెంట్ ఇంజంక్షన్ నిమిత్తం పై కోర్టు నందు దావా దాఖలు చేసి ఉన్నందున ఆ దావాలో మీకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీకు చేరనందున మీ హాజరు నిమిత్తం శ్రీకోర్టు వారు తేది:05-12-2025కి వాయిదా వేసిఉన్నారు. కావున సదరు తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని, లేదా మీ లాయరు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరై పైదావాలో మీఅభ్యంతరంములు తెలుపుకొన వలయును. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించ బడును.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ: 05-12-2025 ఇట్లు
శ్రీ పాలుగుల్ల విజయ్‌కుమార్ రెడ్డి,
న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం. 9542829193